క్లుప్తంగా

చెత్తాచెదారాల తొలగింపు



చెత్త తొలగించిన అనంతరం బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న కార్మికురాలు

సాక్షి ఎఫెక్ట్..

పహాడీషరీఫ్: జల్‌పల్లి కార్గో రోడ్డులో బయటి ప్రాంతాల నుంచి తీసుకొచ్చి వ్యర్థాలను పడేస్తున్న విషయమై సాక్షి దిన పత్రికలో ఈ నెల 15వ తేదీ బుధవారం 'యథేచ్ఛగా చెత్త పారబోత' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపాలిటీ అధికారులు స్పందించారు. కమిషనర్ వెంకట్రామ్ ఆదేశానుసారం సిబ్బంది ఉదయం నుంచి ముత్యాలమ్మ ఆలయం నుంచి రోడ్డును ఆనుకొని పడేసిన వ్యర్థాలను జేసీబీ, ట్రాక్టర్‌తో తొలగించి, ఆ స్థానంలో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో చెత్తాచెదారాలు పడేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. స్థానిక ప్రజలు కూడా పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

స్నేహితుడి కుటుంబానికి సాయం



నగదు అందిస్తున్న తోటి మిత్రులు

కందుకూరు: తమతో పాటు చిన్నతనంలో చదువుకున్న స్నేహితుడు మరణించడంతో అతని స్నేహితులు ముందుకొచ్చి ఆర్థికసాయం అందించారు. మండల పరిధిలోని రాచులూరు గ్రామానికి చెందిన నర్సింహ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతనితో పాటు తిమ్మాపూర్ జెడ్పీ పాఠశాలలో 1995–96 బ్యాచ్‌లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు కలిసి రూ.36 వేలు జమ చేశారు. బుధవారం ఆ నగదును వారు నర్సింహ కుటుంబ సభ్యులకు అందించి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నరేందర్, సత్యనారాయణ, మహేందర్, కృష్ణారెడ్డి, కిషన్, రాంచంద్రం, యాదయ్య, జగ్‌జీవన్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ కూల్చివేత



ప్రహరీని కూల్చివేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

బడంగ్‌పేట్: ఒక కాలనీనుంచి మరో కాలనీకి వెళ్లే దారిని మూసివేసి ప్రహరీని నిర్మిస్తున్నారు అక్రమార్కులు. శ్రీహిల్స్ కాలనీవాసుల ఫిర్యాదు మేరకు బుధవారం టౌన్ ప్లానింగ్ అధికారులు అక్కడికి వెళ్లి కాలనీ రోడ్డులో కడుతున్న అడ్డుగోడను కూల్చివేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు జెళ్ల రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. శ్రీహిల్స్ కాలనీ నుంచి తిరుమలనగర్ కాలనీకి వెళ్లే రోడ్డును కబ్జా చేసి గోడను నిర్మిస్తున్నారన్నారు. దీంతో అందరం కలిసి కమిషనర్ పి.సరస్వతికి ఫిర్యాదు చేశామన్నారు. ఫిర్యాదును స్వీకరించిన టౌన్ ప్లానింగ్ అధికారి కిరణ్‌కుమార్ అక్కడికి చేరుకొని వాస్తవాలు పరిశీలించి.. అడ్డుగా ఉన్న గోడను మున్సిపల్ సిబ్బంది చేత తొలగించారు. పోలీసులు బందోబస్త్ నిర్వహించారు.

20న సదర్ సమ్మేళనం

మన్సూరాబాద్: ఈ నెల 20న మన్సూరాబాద్‌లోని చౌరస్తా వద్ద సదర్ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ గ్రేటర్ హైదరాబాద్ మాజీ ఉపాధ్యక్షుడు పోచబోయిన గణేష్‌యాదవ్ తెలిపారు. సదర్ సమ్మేళణం ఏర్పాట్లపై యాదవ మహాసభ రాష్ట్ర నాయకురాలు పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్ నివాసంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొల్లు యాదయ్యయాదవ్, కె.జగదీష్‌యాదవ్, మల్లేల శ్రీనివాస్‌యాదవ్, పోచబోయిన శ్రీకాంత్‌యాదవ్, కేశబోయిన రవియాదవ్, ఖరాడి చిట్టియాదవ్, రాఘవేందర్‌యాదవ్, నాగేష్ యాదవ్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

రూ.50.50 లక్షలతో మౌలిక వసతులు

మన్సూరాబాద్: ఆటోనగర్‌లోని అసంపూర్తిగా ఉన్న శ్మశాన వాటికలో రూ.50.50 లక్షలతో అన్ని వసతులు కల్పించామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. ఆటోనగర్‌లోని శ్మశానవాటికను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. దహన సంస్కారాలకు ప్రజలపై భారం పడకుండా కాటిక కాపరులు రూ.18 వేల నుంచి రూ.20 వేలు మాత్రమే తీసుకోవాలన్నారు. ఈ హిందూ శ్మశానవాటికను అన్ని కులాల వారు ఉపయోగించుకోవాలని సూచించారు.



కోమటికుంట చెరువులో పేరుకుపోయిన కాలుష్యం



బాలాపూర్ పెద్ద చెరువులో పేరుకున్న కాలుష్యం

చెరువులు.. కాలుష్య కాసారాలు

- ఒకప్పుడు తాగునీరు, పంట నీరు అందించిన తటాకాలు
- మానవ తప్పిదాలతో నేడు కలుషిత నీటి కేంద్రాలు
- ఇలాగే వదిలితే భూగర్భ జలాలూ కలుషితమయ్యే ప్రమాదం
- చెరువులను పరిరక్షించాలంటున్న ప్రజలు

బడంగ్‌పేట్: ఒకప్పుడు ప్రజలు తాగేందుకు, పంటలకు స్వచ్ఛమైన నీరందించిన చెరువులు నేడు మానవ తప్పిదాలతో కాలుష్య కేంద్రాలుగా మారుతున్నాయి. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా ప్రజలు యథేచ్ఛగా మురుగు నీటిని వదులుతుండటంతో చెరువుల్లోకి చేరి కలుషితం అవుతున్నాయి. దీంతో చెరువులు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో పరోక్షంగా తిరిగి ప్రజలపైనే ప్రభావం పడుతోంది.

డ్రైనేజీనీరు చెరువుల్లోకి..

బడంగ్‌పేట మున్సిపల్‌లో చెరువులకు ఢోకా లేదు. ప్రతి ఊరికి చెరువులు, కుంటలు ఉన్నాయి. కొన్ని కుంటలు రియల్ ఎస్టేట్ మాఫీయాకి కనుమరుగైనప్పటికీ చెరువులు ఇంకా చెరబట్టకుండా బ్రతికే ఉన్నాయి. కానీ చెరువులు నాటి కళను కోల్పోయి కాలుష్యంతో వెక్కిరిస్తున్నాయి. బాలాపూర్‌లోని పెద్ద చెరువు, కుర్మల్‌గూడలోని అంతిరెడ్డి చెరువు, అల్మాస్‌గూడలోని కోమటికుంట చెరువు, పోచమ్మకుంట చెరువు, ఎర్రకుంట చెరువు, నాదర్‌గుల్‌లోని సున్నం చెరువు, మీర్‌పేట్‌లోని పెద్ద చెరువు, వెంకటాపూర్‌లోని బురాన్‌ఖాన్ చెరువు, గుర్రంగూడ, మల్లాపూర్, బడంగ్‌పేట్, మామిడిపల్లి తదితర గ్రామాల చెరువులు, కుంటలు కాలుష్యానికి గురవుతున్నాయి. మున్సిపల్‌లో రోజురోజుకు వలసలు పెరిగి ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకునేందుకు ప్రజలు మొగ్గు చూపుతుండటంతో ఇబ్బడి దిబ్బడిగా వెంచర్లు వెలసి అందులో వేస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్లను గుట్టుచప్పుడు కాకుండా చెరువుల్లోకి వదులుతున్నారు. దీంతో చెరువుల్లో నీరు కాలుష్యమవుతున్నాయి. అధికారులకు ఈ విషయం తెలిసి కూడా మిన్నకుండిపోతున్నారు.

చెరువులను కాపాడాలి

నాడు చెరువులు తాగునీరు, సాగునీరు అందించి గ్రామాలను బతికిస్తే, ప్రస్తుతం ప్రజల స్వార్థంతో అవి కాలుష్య కాసారాలుగా మారిపోతున్నాయి. చెరువుల్లో కాలుష్యం పెరిగితే భూగర్భజలాల్లో కాలుష్యం పెరుగుతోందని తెలిసికూడా నిర్లక్ష్యంగా వదిలివేయడం బాధాకరం. చెరువులను కాలుష్య బారిన కాకుండా కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఆ దిశగా ప్రభుత్వం, నాయకులు ఆలోచనలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

శుభ్రం చేయిస్తాం



చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను, అలాగే వర్థ్యాలను తొలగించి శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇరిగేషన్ అధికారులను కలుపుకొని మరిన్ని చెరువులను పరిశీలించి వ్యర్థాలను తీసేస్తాం. చెరువుల చుట్టు పక్కల ఉన్న కాలనీవాసులు ప్లాస్టిక్ వస్తువులు, చెత్తను చెరువుల్లో వేయకుండా జాగ్రత్త పడాలి.

పి.సరస్వతి, కమిషనర్

కలాం జీవితం అందరికీ ఆదర్శం



విద్యార్థులకు స్పోర్ట్స్ మెటీరియల్, పుస్తకాలు పంపిణీ చేస్తున్న కలాం ఫౌండేషన్ నిర్వాహకులు

లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి

కందుకూరు: డాక్టర్ అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శమని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. భారత మాజీ రాష్ట్రపతి, ప్రఖ్యాత శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం జయంతి ఉత్సవాలను లయన్స్‌క్లబ్ ఆఫ్ ఎవరెస్ట్, కలాం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని గూడూరు జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కలాం విద్యార్థులను అత్యంత విలువైన దేశీయ వనరులుగా భావించారన్నారు. కలాం సూచించిన విధంగా పిల్లలు తమ ఆశయాలు, కలల సాకారానికి నిరంతరం సాధన, కృషి చేయాలన్నారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన శ్రీనేత్రాలయ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కలాం ఫౌండేషన్ నిర్వాహకులు సరఫరా చేసిన స్పోర్ట్స్ మెటీరియల్, నోట్ పుస్తకాలను లయన్స్‌క్లబ్ గవర్నర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలాం ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఇమ్మడి బుచ్చయ్య, శంకర్, వేణుధర్‌రెడ్డి, చిరంజీవి, చంద్రశేఖర్, లయన్స్ క్లబ్ జిల్లా క్యాబినేట్ సెక్రటరీ తాళ్ల అంజయ్య, జిల్లా సెక్రటరీ ఐనవోలు మహేందర్‌రెడ్డి, ఎవరెస్ట్ క్లబ్ అధ్యక్షుడు సుబ్బయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ నాయకుల ఆత్మీయ సమ్మేళనం

హాజరుకానున్న మెదక్, చేవెళ్ల ఎంపీలు రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న నాయకులు

మహేశ్వరం: మండల పరిధిలోని నాగారం గ్రామం కుండె వెంకటేశ్ ఫాంహౌస్‌లో గురువారం బీజేపీ మండల నాయకుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నామని మండల అధ్యక్షుడు టి.యాదిశ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పార్టీ నాయకులు హాజరవుతున్నారని, నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు

వంద శాతం ఆస్తిపన్ను వసూలు చేయాలి

చాదర్‌ఘాట్: మలక్‌పేట సర్కిల్–6 పరిధిలో వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని డిప్యూటీ కమిషనర్ అలీ అన్నారు. బుధవారం ఆయన ఓల్డ్‌మలక్‌పేట, అజంపురా డివిజన్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 2025–2026 ఆర్థిక సంవత్సరానికి రూ.80 కోట్లు లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ.52 కోట్లు వసూలైందన్నారు. పన్ను వసూలుపై నిరంతరం సమీక్ష సమావేశం ఉంటుందని అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

సదర్ ఉత్సవాల విధి విధానాలు రూపొందించాలి

సైదాబాద్: సదర్ ఉత్సవాలకు ప్రభుత్వం విధి విధానాలను రూపొందించాలని రాష్ట్ర సదర్ ఉత్సవ సమితి అధ్యక్షుడు మైల్‌కోల్ మహేందర్ యాదవ్ కోరారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అఖిల భారత యాదవ మహాసభ వినతి మేరకు గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం సదర ఉత్సవాలను రాష్ట్ర అధికార పండగగా గుర్తించిందన్నారు. అయితే ఈ సంవత్సరం మరో వారం రోజుల్లో ఉత్సవాలు ఉన్నా ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం సరికాదన్నారు. సదర్ ఉత్సవాలను అధికార పండగగా ప్రకటించిన ప్రభుత్వం ఉత్సవాలు ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీసీ నాయకుల ఇళ్ల వద్ద నిఘా

చాదర్‌ఘాట్: చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో బీసీ నాయకుల వద్ద పోలీసులు నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 18న రాష్ట్రవ్యాప్తంగా బంద్ తలపెట్టిన నేపథ్యంలో వివిధ పార్టీలు మద్దతు తెలపటంతో ఆ పార్టీకి సంబంధించిన బీసీ నాయకుల ఇళ్ల వద్ద పోలీసులు నిఘా ఉంచారు. అవసరమైతే స్టేషన్‌కు పిలిపించి బైండోవర్ చేయించుకొంటున్నారు. ఈ క్రమంలో బీసీ నాయకులు తమ తమ ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకొని వేరే ప్రాంతాలకు వెళ్తున్నట్లు సమాచారం. బంద్‌లో పాల్గొనక పోయినా పోలీసులు తమ ఇళ్ల చుట్టూ తిరగడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

బస్సు సేవలు పునఃప్రారంభం



బస్సు ప్రారంభిస్తున్న సమంత, చిలుక ఉపేందర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ పరిధి మీదుగా వెళ్లే ఆర్టీసీ బస్సుల సేవలను కరోనా తర్వాత నిలిపివేశారు. ఐదేళ్ల తర్వాత బుధవారం బస్సుల సేవలు పునః ప్రారంభం కావడంతో డివిజన్ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. దిలుసుఖ్‌నగర్ డిపో మేనేజర్ డీఎం సమంత, కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, కాలనీవాసులతో కలిసి జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఐదేళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ తీసుకెళ్లగా బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో తలాటి రమేష్ నేత, సురేంద్ర కుమార్, జ్ఞానేశ్వర్ యాదవ్, సైదులు, శేఖర్ ముదిరాజ్, బొడ్డుపల్లి మహేందర్, మహమ్మద్, లింగా స్వామి గౌడ్, జగిని రమేష్, యాదవ రెడ్డి, జెల్లా జగన్నాథం , శ్రీధర్, హరి, శ్రవణ్, సంతోష్, శశి యాదవ్ పాల్గొన్నారు.

ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

మలక్‌పేట: కార్పొరేట్ విద్యా సంస్థల ఆగడాలు అరికట్టాలని, ఫీజుల కోసం విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తున్నారని కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు కోసం విద్యార్థినిని వేధింపులకు గురి చేసిన విషయమై బుధవారం ఆయన మలక్‌పేట పోలీసులను కలిసిన అనంతరం మాట్లాడారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ కాలేజీ నిర్వాహకులు ఫీజు కోసం కాలేజీలోనికి రానివ్వకుండా విద్యార్థినిని ఇంటికి పంపారని, విద్యార్థిని తండ్రి రమణాచారితో కలిసి ఇంటర్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఫీజుల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులను ఇబ్బందులు పెట్టే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్, హాజరి శ్రీనివాస్‌రావు, యోగేష్‌యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేఏసీ చైర్మన శ్రీనివాసులు

పార్టీకి కార్యకర్తలే కీలకం

మలక్‌పేట: పార్టీకి కార్యకర్తలే కీలకమని, పార్టీ కోసం పని చేసేవారికి గుర్తింపు ఉంటుందని ఏఐసీసీ అబ్జర్వర్, ఎమ్మెల్యే అమీన్ అమీర్ అలీ పటేల్ అన్నారు. టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి, మలక్‌పేట ఇన్‌చార్జి చేకోలేకర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' పేరుతో మూసారంబాగ్ డివిజన్ కార్యకర్తల సమావేశం బుధవారం సలీంనగర్ రజక సంఘం భవనంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రేటర్ హైదరాబాద్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పార్టీ విజయానికి సమష్టిగా పని చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో చేకోలేకర్ లక్ష్మీ, శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్, సంఘిరెడ్డి, కిషన్‌సింగ్, శ్రీనివాస్‌రావు, ప్రత్యూష పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమీన్ పటేల్

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

సీడీపీఓ శాంతిశ్రీ

కందుకూరు: పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు తాగించాలని, పాలల్లో ఎన్నో పోషకాలు ఉంటాయని ఐసీడీఎస్ ప్రాజెక్టు మహేశ్వరం సీడీపీఓ శాంతిశ్రీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అగర్‌మియాగూడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం ప్రోగ్రాంను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తల్లి తమ పిల్లలకు పాలు ఇవ్వడంతో అటు తల్లికి, ఇటు పిల్లలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. మనం తీసుకునే ఆహారంలో అన్ని రకాల తృణ ధాన్యాలు, పండ్లు ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం ఆడవారిలో రుతు క్రమం సమయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, ఉపాధ్యాయురాలు వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు బాలమణి, శైలజ, శమంత, శోభ, కవిత, మంజుల, జహంగీర్‌బీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ శాంతిశ్రీ

మురుగునీటి సమస్య పరిష్కరిస్తాం

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి

బడంగ్‌పేట్: డ్రైనేజీ సమస్యను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్ఆర్ దృష్టికి తీసుకెళ్లి కొత్త లైన్లు వేయించేలా కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, 24వ డివిజన్ అధ్యక్షుడు నవారు మల్లారెడ్డి అన్నారు. బుధవారం స్థానికులతో కలిసి ఆయన అల్మాస్‌గూడలోని వైఎస్ఆర్ పార్కు వద్ద కూడలిలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ లైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల్లో చిన్న పైపులైన్లు వేయడంతో ప్రస్తుతం ఇళ్లు పెరిగి ఫ్లో ఎక్కువ కావడంతో అవి పొంగిపొర్లుతున్నాయన్నారు. నెల రోజులుగా కంపుతో భరించలేక కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధాన రోడ్డుపై మురుగు నీరు పారుతుండటంతో వాహనదారులు, దుకాణాదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే కార్పొరేషన్ డీఈఈ వెంకన్న దృష్టికి తీసుకెళ్లగా తాత్కాలికంగా చర్యలు తీసుకుంటానని మాట ఇచ్చారన్నారు. త్వరలో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకునేలా చూస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో వంశీ, నరేందర్, చంద్రం, హనుమాన్, ప్రసాద్, మల్లేశ్, అమరేందర్, జగన్, బాబ్జి, శ్యామ్ తదితరులు ఉన్నారు.



వైఎస్ఆర్ పార్కు వద్ద డ్రైనేజీలను పరిశీలిస్తున్న నాయకుడు మల్లారెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

మన్సూరాబాద్: సింధూర్ ఎన్‌క్లేవ్ హైరెంజ్ అపార్ట్‌మెంట్ వాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ అన్నారు. కాలనీలోని యువేరా అపార్ట్‌మెంట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. జాతీయ రహదారి నుంచి కాలనీకి నేరుగా అనుసంధానం విషయమై ఉన్నతాధికారులతో చర్చిస్తానని సర్వీస్ రోడ్డులో ప్రైవేటు వాహనాల పార్కింగ్ చేయకుండా ట్రాఫిక్ పోలీసుల మట్లాడుతానన్నారు. కాలనీలోని డ్రైనేజీ కలిపే విషయంలో కోర్టు స్టే విధించిందని, స్టేను వెకెట్ చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎల్‌బీనగర్‌లో రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఈ సమావేశంలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నవీన్‌రెడ్డి, నాయకులు భీమిడి రామకృష్ణారెడ్డి, అపార్ట్‌మెంట్‌వాసులు నర్సిరెడ్డి, రాజేందర్ రెడ్డి, జానకీరామ్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుయాష్కి గౌడ్

బీసీ సంఘాల రాష్ట్ర బంద్‌కు సీపీఎం మద్దతు



మాట్లాడుతున్న నర్సిరెడ్డి

ఎల్‌బీనగర్: బీసీ సంఘాల పిలుపు మేరకు ఈ నెల 18 రాష్ట్ర బంద్‌కు సీపీఎం మద్దతు ప్రకటించింది. హయత్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు కీసరి నర్సిరెడ్డి మాట్లాడారు. బీసీ సంఘాలు కోరుతున్న 42 శాతం రిజర్వేషన్ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపినా గవర్నర్ వద్దే ఆగిపోయిందన్నారు. బీజేపీ మాటల్లో తేనెలు పలికించినా చేతల్లో విషం నింపుతుందని దానికి ప్రత్యక్ష ఉదాహరణ బీసీ రిజర్వేషన్ బిల్లు అన్నారు. బీసీల పట్ల ప్రేమ చూపిస్తున్నట్లు నటిస్తున్న బీజేపీ ప్రభుత్వం బిల్లును ఎందుకు ఆమోదించడం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో వెంకన్న, వీరయ్య, నరహరి, సత్యనారాయణ, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణకు చర్యలు

మన్సూరాబాద్: కాలనీలోని డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణకు చర్యలు చేపట్టనున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. హయత్‌నగర్ పరిధిలోని ఆర్టీసీకాలనీ ఫేజ్–2 కాలనీవాసుల వినతి మేరకు బుధవారం ఆయన కాలనీలో పర్యటించగా వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. నూతన డ్రైనేజీ పనులు, సీసీ రోడ్డు పునరుద్ధరణ పనులకకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తామన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



నిరసన తెలుపుతన్న నాయకులు

నాగోలు: బీసీ బిల్లును తొమ్మిదో షెడ్యూల్లో చేర్చి రాజ్యాంగ సవరణ చేయాలని హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకులు బొడ్డుపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఎల్‌బీనగర్ శ్రీకాంతాచారి చౌరస్తా వద్ద బాబూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..రాష్ట్రంలోని బీసీ జనాభా ప్రతిపాదికన కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ఆమోదించి గవర్నర్‌కు పంపినప్పటికీ, గవర్నర్ ఆమోదం తెలపకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. హైకోర్టు ఇచ్చిన స్టేను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో చుక్కయ్య, ఉడతల మల్లేష్ గౌడ్, గోరుగంటి కృష్ణ, డి. నిరంజన్, పగిళ్ల జోజీ, గడసందుల రాము పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గం పహడ్‌నగర్, అల్లాయ్‌నగర్ ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని వెంటనే పరిష్కరించాలని బీఎస్‌పీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం పార్టీ అధ్యక్షుడు వేముగంటి సంపత్ హయత్‌నగర్ డీసీకి వినతిపత్రం అందజేశారు. గత 25 సంవత్సరాల క్రితం వేసిన డ్రైనేజీ పైపులు పాడైపోవడంతో డ్రైనేజీ పైపులు లీకై పోతున్నాయని వాటి స్థానంలో కొత్తపైపులు వేయాలని వినతిలో కోరారు.



డీసీకి వినతిపత్రం ఇస్తున్న సంపత్